నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, | ఆదివారం 4 మే 2025 | VIKARABAD




యాచారం : కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

**నమస్తే తెలంగాణ కథనానికి స్పందించిన జిల్లా అధికారులు**

యాచారం, మే 3 : ధాన్యం కొనుగోలు సక్రమంగా జరుగకపోవడంతో గింజా కొనలే.. అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో శనివారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని యాచారం, నందివనపర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఏ డీపీఎంలు నరసింహ, విలాస్‌రావులు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్న తీరును ఏపీఎం సాంబశివుడు, సిబ్బంది, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని యాచారం, నందివనపర్తి, చింతపట్ల గ్రామాల్లో ఐకేపీ మహిళల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు చెప్పారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ. 2,300 మద్దతు ధరతోపాటు రూ. 500 బోనస్‌ను అందించనున్నట్లు తెలిపారు. రైతులు 16-17 శాతం తేమ వచ్చేలా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీసీలు గణేశ్, నరసింహ, అశోక్, స్వరూప, శ్రీహరి పాల్గొన్నారు.

నమస్తే ఎఫెక్ట్

## ధాన్యం సేకరణ ప్రారంభం

ఇబ్రహీంపట్నం : గింజా కొనలే.. ఎక్కడి ధాన్యం అక్కడే.. అనే శీర్షికతో శనివారం 'నమస్తేతెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం నియోజకవర్గంలోని దండుమైలారం, బోడకొండ, తొర్రూరుతోపాటు పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. నెల రోజులుగా కల్లాల్లోనే ధాన్యాన్ని ఆరబోస్తూ ఇబ్బందులకు గురవుతున్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు. 'నమస్తేతెలంగాణ'లో ఫొటోతో వార్త వచ్చినందుకే అధికారులు శనివారం మా ఊరికి వచ్చి ధాన్యాన్ని కొన్నారని బోడకొండ గ్రామానికి చెందిన మహిళా రైతు జాటోతు నాను సంతోషం వ్యక్తం చేసింది.



బోడకొండ కొనుగోలు కేంద్రంలో ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు, లారీలో బస్తాలు లోడ్ చేస్తున్న కూలీలు

### అనుమతి జీ ప్లస్ టూ..

## నిర్మాణం ఆరు అంతస్తులు

**ఆదిబట్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేత**

ఆదిబట్ల, మే 3 : అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టిన భవనాలను శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ మున్సిపాలిటీ పరిధిలో జీ ప్లస్ టూ పర్మిషన్ తీసుకుని ఎంతోమంది అక్రమంగా ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు భవనాలను నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు. ఆదిబట్ల టీసీఎస్ ఎదురుగా అనుమతులకు మించి నిర్మించిన 25 భవనాలను గుర్తించి .. అందులో ఆరు భవనాల స్లాబులను కూల్చివేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారు వెంటనే తమ పనులను నిలిపేయాలని.. లేనిచో కూల్చివేతలు తప్పవన్నారు. అదేవిధంగా మంగల్‌పల్లి, ఆదిబట్ల, కొంగరకలాన్, ఎంపీపటేల్‌గూడతోపాటు మరి కొన్ని గ్రామాల్లోనూ అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతున్న దాదాపు 80 భవనాలను గుర్తించామని.. వాటన్నింటినీ కూల్చివేస్తామన్నారు. పర్మిషన్ తీసుకున్న తర్వాత నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



ఆదిబట్లలో అనుమతులకు మించి నిర్మించిన భవనాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది



యాలాలలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇల్లు

### కేవలం 35 మందికే.. రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం

# ఇందిరమ్మ సాయం కొందరికే..

- మిగిలిన లబ్ధిదారులకు గుండు సున్నానే
- వికారాబాద్ జిల్లాలో మొదటి విడుతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు 2285
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న 2250 లబ్ధిదారులు
- ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్న ఇండ్లు కూలగొట్టి.. రోడ్డున పడ్డ లబ్ధిదారులు
- జిల్లాలో అర్హులుగా 1,50,000 మందిని గుర్తించిన అధికారులు
- జిల్లాకు మంజూరైన ఇండ్లు 14,000
- ఇప్పటివరకు మార్కింగ్ పూర్తైన ఇందిరమ్మ ఇండ్లు 386
- పునాది వరకు పూర్తైనవి 73..



బషీరాబాద్ : మల్కన్‌గిరిలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగానే ఉన్న ఇంటిని కూల్చేసిన కుర్వ మల్లప్ప అనే వ్యక్తి

### దివ్యాంగురాలికి ఇల్లు ఇవ్వరా..?

ఇల్లు, భూమి కూడా లేదు. అద్దె ఇండ్లలో పిల్లలతో కలిసి ఉంటున్నా. తన భర్త 2013లో చనిపోయాడు. ఎంతమందికి ఇంటి గురించి దరఖాస్తు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఇంటి ఓనర్లు ఎప్పుడు వెళ్లిపొమ్మంటే అప్పుడు ఇల్లు మారాల్సిందే. తాను దివ్యాంగురాలిని. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే బతుకుతున్నా. పిల్లలను చదివించేందుకు కుట్టు పని చేస్తున్నా. ఒక్కోసారి గిరాకీ ఉంటుంది. మరోసారి ఉండదు. కలెక్టర్‌ను కలవాల్నో, ఎవర్ని కలవాల్నో అర్థం కావడంలేదు. అధికారులు, నాయకులు స్పందించి తనకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి. **-గొల్ల స్రవంతి, తిమ్మాయిపల్లి గ్రామం, యాలాల మండలం**



వికారాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్ల పథకంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. పైలెట్ ప్రాజెక్టు పేరిట మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి ఇండ్లను నిర్మిస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వం.. నాలుగు నెలలు గడిచినా ఇప్పటికీ ఇండ్ల నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లలేదు. లబ్ధిదారుల ఎంపిక పూర్తైన వెంటనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మొదటి విడతగా రూ.లక్ష సాయం అందిస్తామని చెప్పినా లబ్ధిదారుల్లో చాలామందికి ఇప్పటికీ రూపాయీ అందలేదు. జిల్లాలో 2,285 ఇందిరమ్మ ఇండ్లకు అనుమతులు మంజూరైతే వాటిలో కేవలం 35 ఇండ్లకు మాత్రమే రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందింది. మిగిలిన లబ్ధిదారులు ఉన్న ఇండ్లను కూల్చుకుని..అప్పులు చేసి పునాది వరకు పూర్తి చేసుకోగా.. మరికొందరు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేశామని జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. పైలెట్ గ్రామాల్లో నాలుగు నెలలు గడుస్తున్నా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి కనిపించడం లేదు. నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 14,000 ఇండ్లు జిల్లాకు మంజూరయ్యాయి.

వాటిలో మొదటి విడతలో భాగంగా 2,285 ఇండ్లకు కలెక్టర్ అనుమతులు మంజూరు చేశారు. అయితే, వాటిలో 368 ఇండ్లకు గృహ నిర్మాణ శాఖ అధికారులు మార్కింగ్ ఇవ్వగా కేవలం 73 ఇండ్ల పనులు పునాది వరకు పూర్తికాగా, మిగతావి మార్కింగ్ దశలోనే నిలిచిపోయాయి. కాగా జిల్లాలో అర్హు లు 1,50,000 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా, గతంలో ఇంటి నిర్మాణం ఎలాగున్నా బిల్లులు చెల్లిస్తామని అధికారులు చెప్పారని.. తీరా నిర్మాణం ప్రారంభించిన తర్వాత బిల్లుల చెల్లింపుల్లో హౌసింగ్ అధికారులు కొర్రీలు పెడుతున్నారని లబ్ధిదారు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 40 నుంచి 60 గజాల్లోపే ఇంటిని నిర్మించుకోవాలని.. నిబంధనలు అతిక్రమిస్తే బిల్లులు రావని చెబుతున్నారని వాపోతున్నారు. దీంతో చాలామంది లబ్ధిదారులు ఇండ్లు కట్టుకోవాలా? వద్దా? అనే సందిగ్ధంలో పడిపోయారు.

### ఇంటిని కూల్చి.. కిరాయికి ఉంటున్నా..

ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని ఉన్న ఇంటిని కూల్చివేశా. ఇప్పుడేమో అధి కారులు సర్వర్ రావడం లేదు. సర్వర్ వచ్చినప్పుడు నీ పేరు, ఇంటి స్థలం కంప్యూటర్‌లో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తాం. అప్పుడు ఇంటి నిర్మాణ పనులను చేపట్టవచ్చునని చెబుతున్నారు. ఇంటిని కూల్చేయడంతో కిరాయికి ఉంటున్నా. ఎప్పుడు ఇంటి నిర్మాణం పూర్తవుతుందో.. ఇంకా ఎన్ని రోజులు అద్దె ఇంట్లో ఉండాల్సి వస్తుందో..?

**-కుర్వ మల్లప్ప, మల్కన్‌గిరి, బషీరాబాద్**



### ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయరూ..

నా భర్త సర్దార్‌తో కలిసి కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. మాకు ముగ్గురు సంతానం. మట్టి గోడలతో ఉన్న మా ఇల్లు ఈదురుగాలులు, వర్షానికి కూలిపోయింది. కూలిపోయిన భాగంలో కవర్ కప్పి అందులోనే జీవిస్తున్నాం. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఎంతో ఆశించాం కానీ రాలేదు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా లేమనే ఉద్దేశంతో రాలేదని తెలిసింది. అధికారులు స్పందించి గూడు లేని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తే బాగుంటుంది. **-లాల్‌బీ, సంతాపూర్, కేశంపేట**

### అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లా..?

గూడులేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అనర్హులను ఎంపిక చేశారనే ఆరోపణలున్నాయి. కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేశారంటూ పేద లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నియమించిన కమిటీల్లో కాంగ్రెస్‌కు చెందిన వారే ఉండడంతో వారికి అనుకూలంగా ఉన్న వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని పలువురు మండిపడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టినా పార్టీలకతీతంగా అర్హులందరికీ ఆయా పథకాల ఫలాలను అందజేసిందని.. కానీ, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక కూడా పారదర్శకంగా జరగలేదని ఆరోపిస్తున్నారు. ప్రజాపాలనతోపాటు గతంలో స్వీకరించిన వా టిలో 2,50,000 దరఖాస్తులుండగా, వాటిలో 1,50, 000 దరఖాస్తుదారులను అర్హులుగా అధికారులు తేల్చారు.



### రూ.3 లక్షలు అప్పు చేశా..

రూ.మూడు లక్షల వరకు అప్పు చేసి ఇందిరమ్మ ఇంటిని బేస్‌మెంట్ వరకు పూర్తి చేశా. బిల్లు చెల్లించేందుకు అధికారులు కొర్రీలు పెడుతున్నారు. 764 ఎస్‌ఎఫ్‌టీలో బేస్‌మెంట్‌కట్టారని అధికారులు తమకు రావాల్సిన రూ.లక్ష బిల్లు చెల్లించడం లేదు. **-కుర్వ మమత, తాండూరు రూరల్**

### నిరుపేదలకు ఇళ్లు రావా..?



మాకు రెండు చిన్న గదులున్నాయి. అందులో కుటుంబమంతా ఉండేందుకు చాలా ఇబ్బందిగా ఉన్నది. అంతేకాకుండా వానకాలంలో ఇల్లు ఉరుస్తుండడంతో కవర్లు కప్పినం. ఇల్లు కూలుతుందేమోనని భయంగా ఉన్నది. ఇందిరమ్మ ఇం టి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఎవరూ పట్టించుకోవడంలేదు. తనలాంటి పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఆదుకోవాలి.

**-గొల్ల వెంకటప్ప, తిమ్మాయిపల్లి గ్రామం, యాలాల**

### కాంగ్రెస్ లీడర్లే ఇందిరమ్మ ఇల్లు ఇస్తారా..?

మా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల విషయంలో చాలా అవకతవకలు జరుగుతున్నాయి. ఇల్లు కావాలంటే రూ. 20 వేలు ఇవ్వాల్సిందేనని ఒక కాంగ్రెస్ లీడర్ డిమాండ్ చేస్తున్నాడు. నిరుపేదలు అన్ని డబ్బులు ఇచ్చి ఇల్లు కొనుక్కోవాలా..? ఈలాంటి వ్యక్తులపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకొని గూడ లేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలి.

**-బాలప్ప, జనగాం గ్రామం పెద్దేముల్**



### బేస్మెంట్ నిర్మించి రెండు నెలలవుతున్నది..

జాబితాలో పేరు వచ్చిందన్న సంతోషంతో ఉన్న ఇంటిని కూలగొట్టి.. బేస్‌మెంట్ వరకు ఇంటిని నిర్మించా. బేస్‌మెంట్ వరకు పూర్తి కాగానే రూ.లక్ష చెల్లిస్తామని అధికారులు చెప్పా రు. దాదాపుగా రెండు నెలలు దాటుతున్నా ఇప్పటివరకూ రూపాయి రాలేదు. అధికారులను అడిగితే.. మీ గ్రామంలోని మిగిలిన లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు పూర్తి చేస్తే.. ఆ వివరాలను పై అధికారులకు పంపిస్తామని అప్పుడు డబ్బులు వస్తాయని చెబుతున్నారు.

**- అనురాధ, మల్కన్‌గిరి, బషీరాబాద్**



### నిధులను త్వరగా చెల్లిస్తే బాగుండు..

ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు రావడంతో ఇంటి నిర్మాణానికి పనులు ప్రారంభించా. ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. నిర్మాణం పూర్తైన తర్వాత డబ్బులు వస్తాయో రావో అనే దిగులుగా ఉన్నది. ఇంటి నిర్మాణానికి రూ .5 లక్షలు సరిపోవు. అప్పులు తీసుకొచ్చిన పూర్తి చేయాల్సిందే.

**-కెరెళ్లి ప్రియాంక, పెండ్లి మడుగు, వికారాబాద్**



### నిబంధనల ప్రకారం నిర్మించలేదని..

ఉన్న ఇంటిని కూల్చి.. ఇందిరమ్మ ఇంటిని బేస్‌మెంట్ వరకు పూర్తి చేశా. రూ.లక్ష బిల్లు మంజూరు చేయాలని అధికారులను కోరితే, నిబంధనల ప్రకారం మీరు ఇంటిని కట్టలేదని బిల్లు చెల్లించడం లేదు. 40-60 గజాల కంటే ఎక్కువస్థలంలో ఇంటి నిర్మించారని.. అందుకే బిల్లులు రావని చెబుతున్నారు. ఉన్న ఇంటిని కూల్చి, అద్దె ఇంట్లో ఉంటున్నాం. బిల్లులు రాకుంటే ఎలా..?

**-కుమ్మరి రాములు, తాండూరు రూరల్**

# కల్లాల్లో.. కన్నీళ్లు..

- అకాల వర్షాలకు తడిసి ముద్ద అవుతున్న వడ్లు..
- తీవ్ర నష్టాన్ని మిగిల్చిన శుక్రవారం రాత్రి కురిసిన వర్షం
- కొనుగోళ్లలో జాప్యంతో కల్లాల్లో నిలిచిపోయిన ధాన్యం
- తడిసిన ధాన్యాన్ని కొనాలని అన్నదాతల ఆందోళన

ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసిపోయిన ఆరబెట్టిన ధాన్యం



రంగారెడ్డి, మే 3 (నమస్తే తెలంగాణ) : రైతన్న ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాడు. వరి కోతలు ముమ్మరమైనా ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో.. ధాన్యాన్ని రోడ్లపై.. కల్లాల్లో ఆరబోస్తుండగా.. గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ఎక్కడికక్కడే వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. ఈ పరిస్థితిలో ధాన్యాన్ని విక్రయించడం వారికి ప్రాణసంకటంగా మారింది. జిల్లాలో శుక్రవారం రాత్రి.. అదేవిధంగా శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ధాన్యం నానిపోయి అన్నదాతకు నష్టాన్ని మిగిల్చింది. జిల్లాలో ధాన్యాన్ని సేకరించేందుకు 40 కొనుగోలు కేంద్రాలను ఏర్పా టు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అందులో సగం కూడా ప్రారంభం కాలేదు ..ఓపెన్ అయిన కేంద్రాలు కూడా మూడురోజులకే మూతపడ్డాయి. ఓ వైపు గన్నీ బ్యాగులు, మరోవైపు హమాలీల కొరతతో కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరుగడంలేదు.

### కొనుగోళ్లు 20వేల మెట్రిక్ టన్నులే..

ఈ యాసంగిలో జిల్లాలో 2,30,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా.. 20,000 మెట్రిక్ టన్నులే కొనాలని లక్ష్యం గా పెట్టుకున్నారు. దీంతో మిగతా రైతులు ధాన్యాన్ని ఎక్కడ అమ్ముకోవాలో తెలియక మధ్యదళారులను ఆశ్రయిస్తున్నారు. పంట లు కోసి ధాన్యాన్ని కల్లాలు, రోడ్లపై ఆరబోస్తున్నారు. రోజుల తరబడి కొనుగోళ్లు లేకపోవడంతో రోడ్లపైనే ధాన్యం రాశులు పోసి రాత్రింబవళ్లు కాపలా ఉండాల్సిన పరిస్థితి అన్నదాతకు ఏర్పడింది. ప్రభుత్వం స్పం దించి తడిసిన ధాన్యాన్ని కూడా సేకరించాలని పలువురు కోరుతున్నారు.



హైదరాబాద్-శ్రీశైలం హైవేపై బైఠాయించి తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

### కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో అన్నదాతలు రోడ్ల పక్కన, కల్లాల్లోనే వడ్లను రోజుల తరబడిగా ఉంచి కాపలాగా ఉంటున్నారు. మరోవైపు అకాల వర్షాలకు ఎండిన వడ్లు కూడా తడిసి ముద్దవుతున్నాయి. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకోవాలి. **-జంగయ్య, రైతు**

### రోడ్లపైనే రాశుల కుప్పలు..

జిల్లాలోని ఏ రోడ్డును చూసినా ధాన్యం కుప్పలే దర్శనమిస్తున్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అనువైన స్థలం లేకపోవడంతో ఔటర్‌రింగ్ రోడ్డు, సర్వీసురోడ్లతోపా టు ఆయా ప్రధాన, అంతర్గత దారుల్లోనూ అన్నదాతలు వడ్లను ఆరబెట్టి కాపలా కాస్తున్నారు. అయినా అకాల వర్షాలతో వడ్లు తడిసి ముద్దవుతున్నాయి.

### తడిసిన ధాన్యాన్ని కొనాలని నిరసన

ఆమనగల్లు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతోపాటు శనివారం కురిసిన వర్షానికి రైతులు ఆరబోసిన వడ్ల కుప్పలు తడిసిపోయాయి. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు రైతులతో కలిసి హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని నిరసన చేపట్టారు.